క్లుప్తంగా

6న శ్రీకృష్ణ జయంతోత్సవం

కాచిగూడ: యాదవ సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈనెల 6 న బుధవారం శ్రీకృష్ణ జయంతోత్సవం నిర్వహిస్తున్నట్లు యాదవ సంఘం ట్రస్ట్ కమిటీ చైర్మన్ నందకిషోర్‌యాదవ్ ప్రకటించారు. ఆదివారం కాచిగూడ, చెప్పల్‌బజార్‌లో ఆయన మాట్లాడుతూ.. ఉదయం 9:30 గంటలకు జెండా వందన కార్యక్రమం, 10 గంటలకు గో సేవా కార్యక్రమం, ఉదయం 11:30 గంటలకు హవనం, సాయంత్రం 6గంటలకు శోభాయాత్ర, గోపూజ, 7 గంటలకు శ్రీకృష్ణ భగవాన్ పూజ, 7:30 గంటలకు భజన, రాత్రి 11:30 గంటలకు డోలారోహణం ఉంటుందని తెలిపారు.

సీఎంను కలిసిన ఎం.ఎన్ శ్రీనివాస్‌రావు



ముషీరాబాద్: నియోజకవర్గ బీఆర్‌ఎస్ టికెట్‌ను ఆశించిన ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు ఎంఎన్. శ్రీనివాస్‌రావు గత కొద్దిరోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఆదివారం ఆయన సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన రాజకీయ భవిష్యత్తు గురించి విన్నవించుకున్నట్లు సమాచారం.

గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా..



సుభాష్ పటేల్

కాచిగూడ: గణేష్ ఉత్సవ సమితి కాచిగూడ డివిజన్ కన్వీనర్‌గా సుభాష్ పటేల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన నూతన సభ్యులను ప్రకటించారు. కో–కన్వీనర్లుగా మల్లికార్జున్, ఓంప్రకాష్, ఆర్.సంతోష్, ఫంకజ్, రాజ్‌కుమార్, సూరి, దీపక్‌సింగ్, శైలేందర్, ఎస్ఎస్ రాము, డి.మురళిని నియమించారు. గణేష్ ఉత్సవ సమితి అంబర్‌పేట నియోజకవర్గం స్థాయి సమావేశం నేడు సాయంత్రం 6 గంటలకు అశోక ఫంక్షన్‌హాల్‌లో జరుగుతుందని, నియోజకవర్గంలోని గణేష్ మండప నిర్వాహకులందరూ.. పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

7న కొర్వి కృష్ణస్వామి జయంతి

కాచిగూడ: ముదిరాజ్ సంఘ వ్యవస్థాపకులు, సంఘసంస్కర్త, నగర మాజీ మేయర్ కీ.శే. కొర్వి క్రిష్ణస్వామి ముదిరాజ్ 130వ జయంతి మహోత్సవ వేడుకలను ఈనెల 7న సికింద్రాబాద్‌లోని ముదిరాజ్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు జయంతి మహోత్సవ కమిటీ అధ్యక్షుడు రాజాపతి ముదిరాజ్, పొట్లకాయల వెంకటేశ్వర్లు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు.

ప్రలోభాలకు లొంగకుండా పనిచేయాలి



ర్యాంకర్లతో అతిథులు

చిక్కడపల్లి: ఏపీపీఎస్సీ గ్రూప్స్–1 పరీక్షల్లో టాపర్లుగా నిలిచి ఉద్యోగాలు సాధించిన అధికారులు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా పనిచేయాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణి సూచించారు. ఆదివారం త్యాగరాయగానసభలో కేపీ యూపీఎస్సీ యూనివర్స్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పోటీపరీక్షల ప్రపంచం ఒక కురుక్షేత్రయుద్ధ భూమిలాంటిదని, అర్జునుడిలా గెలవాలంటే శ్రీకృష్ణుడి లాంటి ఫ్యాకల్టీల మార్గదర్శకత్వం ఉండాలన్నారు. నిరంతర సాధన, నిత్యసాధన లాంటి మెంటర్‌షిప్‌ల ద్వారా అభ్యర్థులు విజయం సాధిస్తారని స్పష్టం చేశారు. విశ్రాంత ఆలిండియా రేడియా డైరెక్టర్ జనరల్ ఆర్ ఆనంతపద్మనాభరావు, అకాడమీ చీఫ్ మెంటర్ డాక్టర్ భవానీశంకర్, సంస్థ చైర్మన్ కృష్ణప్రదీప్‌లు మాట్లాడారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన ర్యాంకర్లు, వారి తల్లిదండ్రులు, ఫ్యాకల్టీలను ఘనంగా సన్మానించారు. కాగా అతిథులు ఈ సందర్భంగా అభ్యర్థుల సందేహాలకు జవాబులిచ్చారు.

ఉత్తమ టీచర్ అవార్డు ప్రదానం

అబిడ్స్: ఆటపా రాష్ట్ర ఫైనాన్స్ కార్యదర్శి కందికొండ శ్రీనివాస్‌కు ఉత్తమ టీచర్ అవార్డు లభించింది. లక్డీకాపూల్‌లోని ఆటపా కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు మల్లిపెద్ది శంకర్‌తో పాటు పలువురు రాష్ట్ర నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు. రాష్ట్రసాయిలో ఉత్తమ టీచర్ అవార్డు పొందడం గర్వకారణంగా ఉందన్నారు. ఆటపా తరఫున ఆయన హర్షం వ్యక్తం చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ..జీవితాంతం విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

టికెట్ అడగడం మా సిద్ధాంతం కాదు

- అవకాశం కల్పిస్తే ఆలోచిస్తా..
- సాక్షితో దత్తన్న కుమార్తె విజయలక్ష్మి ఇంటర్వ్యూ



ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే టికెట్ కేటాయింపుపై మాజీ కేంద్రమంత్రి, ప్రస్తుత హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి పేరు బాగా వినిపిస్తోంది. ఈ విషయంపై సాక్షి ప్రతినిధి ఆమెతో ముచ్చటించారు.

ప్రశ్న: పాలిటిక్స్ అంటే మీకు ఇంట్రెస్ట్ ఉందా?

జవాబు: సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు బీజేపీ సిద్ధాంతాలు కూడా చాలా ఇష్టం. అందుకే అనేక సంవత్సరాలుగా పార్టీ వ్యవహారాల్లోనూ పాల్గొంటున్నాను.

ప్రశ్న: నాన్న అడుగుజాడల్లో నడవాలనుకుంటున్నారా?

జవాబు: నాన్న చిన్నప్పటి నుంచి నేర్పిన నీతి, నైతిక విలువలు, క్రమ శిక్షణతో పాటు ఆయన కొన్ని దశాబ్దాలుగా పనిచేస్తున్న పార్టీ సిద్ధాంతం నచ్చి పార్టీలోకి వచ్చాను. 2014, 2019, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో, బీజేపీ కార్యక్రమాల్లో చురుకుగానే పాల్గొంటూ.. వస్తున్నాను. మా నాన్న సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి గత 35-40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉండటంతో ప్రతి కార్యకర్త, నాయకులతో పరిచయాలు ఉన్నాయి. మా ఇళ్లు, పార్టీ వేర్వేరు అని ఏనాడు అనుకోవడం లేదు. దీనికి తోడు అత్తగారి కుటుంబం కూడా రాజకీయాలతో ముడిపడిన కుటుంబమే. మా మామయ్య చేవెళ్ల పార్లమెంట్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ కూడా చేశారు.

ప్రశ్న: ముషీరాబాద్ టికెట్ కోసం ఏమైనా ప్రయత్నాలు చేస్తున్నారా?

జవాబు: లేదు. మొదట పార్టీ ఆర్గనైజేషన్‌లో పనిచేయాలి. పార్టీ సిద్ధాంతాలను తెలుసుకోవాలి. నేను ఎక్కడైనా సరిపోతానని పార్టీ అనుకుంటే పార్టీ అక్కడ నిలపెడుతుంది. నా వరకు నేను ఇప్పటి వరకు ప్రత్యక్షంగా అడిగింది లేదు. నేను అక్కడ నిలుచుంటానని చెప్పడం మేము నేర్చుకున్న సిద్ధాంతం కాదు. అలా అడగడం మా పార్టీలైన్ కాదు.

ప్రశ్న: ప్రజలు కోరుకుంటున్నారు కదా.?

జవాబు: ప్రజలు ఖచ్చితంగా బీఆర్‌ఎస్ నుంచి వేరే ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు. విజయలక్ష్మిని కోరుకుంటున్నారని నేను అనుకోను. బీజేపీ అభ్యర్థిగా విజయలక్ష్మి సరిపోతుందని పార్టీ అనుకుంటే అప్పుడు ఆలోచిస్తా.. !

ప్రశ్న: డాక్టర్ లక్ష్మణ్ తరువాత మీపేరే ఎక్కువగా వినిపిస్తుంది?

జవాబు: అది నేను అదృష్టంగా భావిస్తున్నాను. కానీ ఎప్పుడు ఎమ్మెల్యే కావాలనే లైన్‌లో పనిచేసింది లేదు. బీజేపీ కార్యకర్తగానే గుర్తించబడటం నాకు ఇష్టం.

ప్రశ్న: ఒక వేళ అవకాశం కల్పిస్తే?

జవాబు: అవకాశం కల్పిస్తే.. పూర్తి బాధ్యతాయుతంగా పార్టీకోసం పనిచేస్తాను.

ప్రశ్న: ఎన్నికలు దగ్గరపడుతున్నాయి, తొందరగా ఒక నిర్ణయానికి వస్తే మంచిదేమో?

జవాబు: మనం ఒక నిర్ణయానికి రావొద్దు, పార్టీ అధిష్టానం రావాలి. వేరే పార్టీలాగ నేను ఇక్కడ నిల్చుంటేనే ఉంటా అనే పార్టీ బీజేపీ కాదు. బీజేపీకి క్రమశిక్షణ కలిగిన వ్యవస్థ ఉంటుంది. పనిచేస్తూ.. పోవాలంతే.. ఫలితం ఆశించకూడదు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



బాగ్‌లింగంపల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లిలోని సిరి నిలయం, సప్తగిరి అపార్ట్‌మెంట్ వాసులు ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు పలు సమస్యలపై ఆదివారం వినతిపత్రం సమర్పించారు. డ్రైనేజీ, వాటర్, వీధిలైట్లు, సీసీ కెమెరాలు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. వారానికి నాలుగు రోజులు డ్రైనేజీ పొంగి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఇళ్లల్లోకి మురికి నీరు వస్తుందని, వీధిలైట్లు, సీసీ కెమెరాలు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయిందన్నారు. అపార్టుమెంట్ పరిసర ప్రాంతాల్లో అనేక డీసీఎంలను అక్రమంగా పార్క్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే చిక్కడపల్లి సీఐ నరేష్‌కు ఫోన్ చేసి అక్రమ పార్కింగ్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి అసాంఘిక చర్యలను అరికట్టాలని ఆదేశించారు. వాటర్ వర్క్స్ అధికారులకు సైతం ఫోన్ చేసి డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు సమాచారం. బీఆర్‌ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావులపాటి మోజెస్, ఎం.దామోదర్ రెడ్డి, వెంకటకృష్ణ బబ్లూ, సుందరయ్య పార్కు అధ్యక్షులు ఎస్.రమేష్‌రెడ్డి, హౌస్‌ఫెడ్ డైరెక్టర్ ఎ.కిషన్ రావు, మనోహర్‌రెడ్డి, అడ్వకేట్స్ రాంచంద్రారెడ్డి, ఆనందరావు, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న ‘మన చరిత్ర’ నాటకం



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నాటకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉపాధ్యాయులకు, పిల్లలకు పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రదర్శించిన ‘మన చరిత్ర’ నాటకం సబికులను ఆకట్టుకుంది. భారత దేశ విలువలకు సంబంధించిన సందేశాత్మకమైన నాటకాన్ని విద్యార్థులు ప్రదర్శించి శభాష్ అనిపించారు. ఉపాధ్యాయులకు వ్యాసరచన, జానపద నృత్యాలు, బతుకమ్మ, కోలాటం, క్విజ్ తదితర పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. తెలంగాణ బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సోమయ్య, ఉపాధ్యక్షులు సుజావతి, ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, బాలోత్సవం సహాయ కార్యదర్శులు రూపా, రుక్మిణి, మమత, రాజు, శంకర్ తదితరులున్నారు.

భక్తిభావంతో వేడుకలను నిర్వహించుకోవాలి



సీవీ ఆనంద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్.శరత్‌శ్యామ్

కాచిగూడ: నగరంలో వినాయక చవితి ఉత్సవాలను భక్తి భావంతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. సెంట్రల్ పీస్ కమిటీ ప్రధానకార్యదర్శి శ్రీకిషన్ శర్మ, అధ్యక్షుడు ఎస్.నారాయణరెడ్డి, సహాయ కార్యదర్శి ఎస్.శరత్‌శ్యామ్‌ల ఆధ్వర్యంలో ప్రతినిధులు ఆదివారం కమిషనర్ సీవీ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. వినాయక చవితి ఉత్సవాల్లో అనుమానిత వ్యక్తులు, వస్తువులు మండపాల సమీపంలో కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. స్నేహ బంధం, ఐక్యత పెంపొందించడానికి నాడు బాలగంగాధర్ తిలక్ గణేష్ ఉత్సవాలను ప్రారంభించారని, అదే లక్ష్యం సంపూర్ణంగా పూర్తి చేయడానికి అందరూ కృషి చేయాలన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ‘భారతరత్న’ ఇవ్వాలి



పద్మశాలీ రాజకీయ శంఖారావంలో పాల్గొన్న గుజ్జ సత్యం

కాచిగూడ: ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీకి ‘భారతరత్న’ ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుజ్జ సత్యం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ‘పద్మశాలీ శంఖారావం’ సభకు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో నారాయణగూడ నుంచి చేనేత కార్మికులు, పద్మశాలీలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఆయన మాట్లాడుతూ.. పద్మశాలీలను గుర్తించి సీట్లు ఇచ్చే పార్టీలకే ఓట్లు వేయాలన్నారు. పద్మశాలీలను నిర్లక్ష్యం చేసే పార్టీలకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రాజకీయంగా పద్మశాలీలు రాణించాలన్నారు. జనాభా ప్రాతిపదికన పద్మశాలీలకు అన్ని రంగాల్లో వాటా దక్కాలని, వాటా కోసం పద్మశాలీలు ఐక్యంగా ఉద్యమించాలన్నారు.

ఆర్యవైశ్య హాస్టళ్లకు దేశంలో ప్రత్యేక స్థానం



చెక్కును అందజేస్తున్న టీ.జీ.వెంకటేష్

ముషీరాబాద్: కులమతాలకు అతీతంగా పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు విద్య, వసతి కల్పిస్తూ.. ఆర్యవైశ్య హాస్టళ్లు దేశంలో ప్రత్యేక స్థానాన్ని పొందాయని మాజీ మంత్రి, బీజేపీ నాయకుడు టీ.జీ.వెంకటేష్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య హాస్టల్ ప్రాంగణంలో వాసవీ ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన వాసవీ ఆర్యవైశ్య టీ.జీ.లక్ష్మీవెంకటేష్ లేడీస్ హాస్టల్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన వాసవీ ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ చైర్మన్ గంజి రాజమౌళిగుప్తా, రాష్ట్ర టూరిజం శాఖ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తాలతో కలిసి హాస్టల్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో టీ.జీ మాట్లాడుతూ.. ఆర్యవైశ్య హాస్టల్‌లో ఉంటూ చదువుకున్న అనేక మంది దేశంలో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. రూ. 6 కోట్లతో నిర్మిస్తున్న లేడీస్ హాస్టల్ నిర్మాణానికి ఆర్యవైశ్య దాతల సహకారంతో త్వరలో పూర్తి చేస్తామన్నారు. హాస్టల్ నిర్మాణానికి రూ.50 లక్షల ఆర్థికసాయం అందజేసిన టీజీని భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత రమేష్, ట్రస్ట్ కోశాధికారి ప్రభాకర్, సంఘం నాయకులు రమేష్ రాం, శ్రీనివాస్‌గుప్తా, కాచం కృష్ణమూర్తిగుప్తా, శ్రీనివాస్‌గుప్తా, రవిరాజు తదితరులున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చిక్కడపల్లి: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగమయ్యకుంట జెడ్‌బీ గార్డెన్ వద్ద 50 ఏళ్లున్న ఓ వ్యక్తి చనిపోయాడని, స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్సై అభిలాష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. రాత్రి కురిసిన వర్షానికి రాత్రంతా తడిసి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి

అంబర్‌పేట: ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. ఆదివారం డివిజన్‌లో జరిగిన ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. చిరునామా మారిన అంశాలను ప్రత్యేకంగా పరిగణలోకి తీసుకోవాలని ఆమె సూచించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



బాగ్ అంబర్‌పేట్‌లో ఓటరు నమోదును పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మ

గర్భిణులకు కిట్లు పంపిణీ



చిక్కడపల్లి: గర్భిణీలు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని నగర బీజేవైఎం మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ సూచించారు. గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో వివేక సేవా సమితి ఆధ్వర్యంలో ఆర్యజననీసంస్థ వారు గర్భిణీలకు ఆరోగ్య రక్షణపై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూట్రిషన్ కిట్లను వినయ్‌కుమార్ గర్భిణీలకు అందజేశారు. రత్నసాయిచంద్, అరుణ్‌కుమార్, పున్న సత్యనారాయణ తదితరులున్నారు.

హరికథ ప్రాచీన కళారూపం



మాట్లాడుతున్న కోలేటి దామోదర్

చిక్కడపల్లి: అన్ని కళలు కలసిన హరికథ ప్రాచీన కళారూపమని తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. ఆదివారం త్యాగరాయగానసభ నిర్వహణలో ప్రముఖ హరికథ పితామవులు ఆదిభట్ల నారాయణదాసు యాదిలో శీర్షికన కళాసుబ్బారావు కళావేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆదిభట్ల పలు భాషల్లో పండితులు, గొప్ప మేధావి, రచయితగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ బి.జయరాములు మాట్లాడుతూ.. హరికథకులు ఆత్మగౌరవంతో జీవించేలా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. గానసభ అధ్యక్షులు వీఎస్ కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖ కథక్ నాట్యగురువులు పండిట్ డాక్టర్ అంజిబాబు, త్యాగరాయగానసభ పాలకమండలి సభ్యులు ఉషా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్యశిబిరంలో వైద్యసేవలు నిర్వహిస్తున్న డాక్టర్ల బృందం

ముషీరాబాద్: కార్పొరేట్ వైద్య ఆసుపత్రులు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ గ్రేటర్ నాయకులు ఎస్.మల్లికార్జున్‌రెడ్డి సూచించారు. కిమ్స్ సన్‌షైన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో అడిక్‌మెట్‌లోని అంబేడ్కర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద ప్రజలకు వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో కిమ్స్ సన్‌షైన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచితవైద్య శిబిరానికి విశేష స్పందన ఉందన్నారు. ఈ సందర్భంగా జనరల్ మెడిసిన్ ఆర్థోపెడిక్, బీపీ, షుగర్ ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు అనురాధి, మహేష్, బీఆర్‌ఎస్ నేతలు బల్ల శ్రీనివాస్‌రెడ్డి, కె.మాధవ్, చిట్టిమార్ విజయ్‌కుమార్, శేషగిరిరావు, ఆకారం శ్రీనివాస్, కార్తీక్‌యాదవ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై పశువుల పెంపకం

పట్టించుకోని అధికారులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని వాటర్‌వర్క్స్ కార్యాలయం సమీపంలోని హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని ఓ వ్యక్తి పశువులను కట్టేసి పెంచుతుండటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఆవుల పేడ, మూత్రంతో పాటు కుళ్లిపోయిన టమాటాలు, పశువులదానా ఉండటంతో దుర్గంధం వెదజల్లుతుందని ప్రజలు వాపోతున్నారు. ఓ స్థానికుడిపై సదరు వ్యక్తి కత్తితో పొడిచేస్తానని బెదిరించినట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



బాగ్‌లింగంపల్లి వాటర్ వర్క్స్‌కార్యాలయం సమీపంలో ఇలా..

బీఆర్‌ఎస్‌లోకి చేరికలు



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు

అంబర్‌పేట: నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ రోజురోజుకు తిరుగులేని శక్తిగా అవతరిస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఆదివారం అంబర్‌పేట సీపీఎల్ రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆయా డివిజన్లకు చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరినవారందరికీ ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించి, ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. స్థానిక బీఆర్‌ఎస్ నేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జమిలి బిల్లుతో పాటు మహిళా బిల్లు !



కేపీ. మురళీకృష్ణ

నల్లకుంట: ఈనెల 16 నుంచి 22 వరకు జరగబోయే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికల బిల్లుతో పాటు మహిళా బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపచేసే ఆలోచనలో ఉందని తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ మురళీకృష్ణ అన్నారు. ఆ మహిళా బిల్లులో బీసీ ఉపకోట తప్పనిసరి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు ప్రాధాన్యత కల్పించకపోతే మహిళా బిల్లుకు సార్థకత లేదన్నారు. ఆదివారం నల్లకుంట రత్నానగర్‌లో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో 33 శాతం మహిళా బిల్లును ప్రవేశపెట్టాలనే ముసాయిదా తయారైందని, ఈ బిల్లును బీసీ జాగృతి వ్యతిరేకిస్తుందన్నారు. దేశ జనాభాలో 60 శాతం మహిళలు ఉండగా.. చట్టసభల్లో కేవలం 33 శాతం మాత్రమే రిజర్వేషన్లు కల్పిస్తే బడుగు, బలహీన వర్గాల మహిళలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కేంద్రం 60 శాతం మహిళా రిజర్వేషన్లు కల్పించేలా బిల్లు ప్రవేశ పెట్టకుంటే దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

జనాభా ప్రాతిపదికన అన్ని పార్టీలు టికెట్లు కేటాయించాలి

పద్మశాలీ శంఖారావం సభకు తరలిన నియోజకవర్గ నాయకులు



ఎన్టీఆర్ స్టేడియం నుంచి కార్ల ర్యాలీగా బయలుదేరిన పద్మశాలీలు

ముషీరాబాద్: జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో పద్మశాలీలకు అన్ని పార్టీలు టిక్కెట్లు కేటాయించి పోటీచేసే అవకాశం కల్పించాలని పలువురు పద్మశాలీ సంఘం నేతలు పిలుపునిచ్చారు. పద్మశాలీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని వారిని రాజకీయం, సామాజిక, ఆర్థికంగా, విద్య, ఉద్యోగ రంగాల్లో అవకాశం కల్పించాలని కోరారు. జనాభా దామాషా ప్రకారం.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పద్మశాలీలకు న్యాయం చేయాలని, చట్టసభల్లో పోటీచేసేలా అన్ని పార్టీలు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ.. ఆదివారం నగరంలోని సరూర్‌నగర్ గ్రౌండ్‌లో, జరిగిన పద్మశాలీ శంఖారావం సభకు ముషీరాబాద్ నియోజకవర్గం ఎన్టీఆర్ స్టేడియం నుంచి వందలాది మంది పద్మశాలీలు ర్యాలీగా సరూర్‌నగర్ గ్రౌండ్‌లో నిర్వహించే పద్మశాలీ శంఖారావం సభకు తరలివెళ్లారు.

- ఎన్టీఆర్ స్టేడియం నుంచి ప్రారంభమైన కార్ల ర్యాలీని, బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఏనుగుల వినయ్‌కుమార్, పద్మశాలీ సంఘం నగర నేతలు కత్తుల సుదర్శన్, పద్మశాలీ సంఘం ముషీరాబాద్ అసెంబ్లీ అధ్యక్షుడు సుదేష్, అఖిల భారత పద్మశాలీ సంఘం కార్యదర్శి బొడ్ల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గుర్రం శంకర్‌లు హాజరై జెండా ఊపి కార్ల ర్యాలీని ప్రారంభించారు.
- ఈ ర్యాలీ ఎన్టీఆర్ స్టేడియం నుంచి అశోక్‌నగర్ వద్ద ఉన్న ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సరూర్‌నగర్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగసభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనేక ఏళ్లుగా పద్మశాలీలు అన్ని రంగాల్లో వెనకబడ్డారన్నారు. రాష్ట్రంలో ఎక్కడైతే పద్మశాలీలు అధికంగా ఉన్నారో.. అక్కడ అన్ని రాజకీయ పార్టీలు పద్మశాలీలకు టిక్కెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా పద్మశాలీలకు టిక్కెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పద్మశాలీ సంఘం నేతలు దశరథ్, మనోహర్, సంజీవ్‌కుమార్, గణేష్, నేత శ్రీనివాస్, సత్యానారాయణ, సోమ సతీష్‌కుమార్, బొట్టు శ్రీనివాస్, చంద్రమౌళి, అమర్, ఎయిర్‌టెల్ రాజు పద్మశాలీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చిక్కడపల్లి నుంచి..

- చిక్కడపల్లి: ముషీరాబాద్ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌లో నిర్వహించిన చలో హైదరాబాద్ పద్మశాలీ శంఖారావం బహిరంగసభకు నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. గాంధీనగర్ అశోక్‌నగర్ చౌరస్తాలోని స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పించిన నాయకులు అనంతరం పెద్ద ఎత్తున సభకు తరలివెళ్లారు. వివిధ పార్టీ పద్మశాలీ నాయకులు గుర్రం శంకర్, ఎ.వినయ్‌కుమార్, సురేష్, కృష్ణంరాజు, దశరథ్, నేత శ్రీను, ఎయిర్‌టెల్ రాజు, నవీన్, శివ తదితరులున్నారు.



శంఖారావానికి తరలిన శంకర్, వినయ్‌కుమార్, సురేష్, కృష్ణంరాజు, పున్న సత్యనారాయణ